క్లుప్తంగా

వసతిగృహాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మెడికల్ అసిస్టెంట్ వెంకట్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న వెంకట్

కుల్కచర్ల: వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుల్కచర్ల మెడికల్ అసిస్టెంట్ వెంకట్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వసతిగృహాల్లో విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో అందరు జాగ్రత్తగా ఉండాలన్నారు.

కొనసాగుతున్న ఎఫ్‌ఏ-2 పరీక్షలు

బొంరాస్‌పేట: విద్యార్థుల అభ్యసనను పాఠశాల స్థాయిలో నిర్మాణాత్మక మూల్యాంకనం చేసేందుకు ఫార్మెటీవ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ) నిర్వహిస్తారు. జూలైలో ఎఫ్‌ఏ-1 నిర్వహించగా ప్రస్తుతం ఎఫ్‌ఏ-2 కొనసాగుతున్నాయి. వివిధపాఠశాలల్లో ఒకటి లేదా రెండు పరీక్షలు పూర్తికాగా మిగిలిన పాఠశాలల్లో ఇంకా సాగదీస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పరీక్షల షెడ్యూల్ పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించకపోవడం, తల్లిదండ్రుల సమావేశాల్లో చర్చించకపోవడం వంటి అంతరాయాలు ఉన్నాయని వాపోతున్నారు. ఈ నెల 20 వరకు పరీక్షల నిర్వహణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో మార్కులను ఉంచాలని డీఈఓనుంచి మండల విద్యాధికారులకు ఆదేశాలున్నాయని వివరించారు. దసరా సెలవులకు ముందే పరీక్షలు పూర్తిచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇందిరమ్మ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్



ప్రొసీడింగ్ అందజేస్తున్న మల్లేశ్‌యాదవ్

దోమ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతాయని ఇందిరమ్మ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తూ రాష్ట్రంలో మెరుగైన పాలన అందిస్తున్నారని గుర్తు చేశారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, బుక్క జావీద్, బోయిని యాదయ్య, జాకారం నారాయణ, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

దుద్యాల్: ఆలేడ్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోజురోజుకు ఈ సమస్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రజల ఇబ్బందులను పరిష్కరించి, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. శుక్రవారం కొంత మంది తెప్పించిన ట్యాంకర్ నీటిని గ్రామస్తులు పట్టుకున్నారు.

పొలానికి వెళ్లేందుకు దారి చూపాలి

తాండూరు రూరల్: పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని ఇందూర్ గ్రామ రైతులు కోరారు. శుక్రవారం పెద్దేముల్ తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ఇందూర్ నుంచి పెద్దేముల్ మండల కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మించాలన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు బురదమయమై అధ్వానంగా మారిందన్నారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు.

రాయితీ యంత్రాలతో మేలు

- యూనిట్ల వారీగా మండలానికి కేటాయింపు
- అర్హులైన రైతులను గుర్తించి పంపిణీ
- వచ్చే నెలాఖరులో అందజేసేందుకు సిద్ధం

దౌల్తాబాద్: సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసే పథకం మళ్లీ షురు కానుంది. దీనికోసం ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానైజేషన్(ఎస్ఎంఏఎం) పథకం కింద అందజేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంట్లో కేంద్ర ప్రభుత్వానిది 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరించనుంది. గత యాసంగిలోనే ప్రక్రియ ప్రారంభించినప్పటికి బడ్జెట్ ముగింపు సందర్భంగా ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల నిధులు విడుదల చేయలేదు.

ఎంపిక బాధ్యత కమిటీలదే

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేసేందుకు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. రాయితీ రూ. లక్ష దాటితే జిల్లా కమిటీ ఆమోదం తప్పనిసరి. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగినవారు దీనికి అర్హులు. మండల స్థాయి కమిటీలో వ్యవసాయ అధికారి, తహసీల్దారు, ఎంపీడీవో ఉండనున్నారు. దీంతో వారు అర్హులను గుర్తించి పంపిణీ చేయనున్నారు. 2017-18 వరకు ఈ పథకం అమలులో ఉంది. మళ్లీ ఏడేళ్ల తర్వాత దీన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. గతంలో ట్రాక్టర్లు అందిచగా, ప్రస్తుతం పనిముట్ల వరకే పరిమితం చేశారు.



రైతులకు అందజేసే యంత్రం

సబ్సిడీ..పనిముట్ల వివరాలు ఇలా

ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పనిముట్లలో మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం సబ్సిడీతో అందించనుంది. మిగతా రైతులకు 40శాతం వర్తించనుంది. ఐదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో వినియోగించే రోటోవేటర్లు, నాగళ్లు, కలుపుతీసే యంత్రాలు, పవర్ టిల్లర్, మొక్కజొన్న తీసే యంత్రాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

మండలానికి కేటాయించినవి

స్ప్రేయర్లు-280, పవర్ స్ప్రేయర్లు 44, రోటోవేటర్లు-13, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్-3, కల్టివేటర్లు, కేజీ వీల్స్, డిస్క్ యారోలు-20, బండ్ ఫార్మర్-1, పవర్ వీడర్-2, బ్రష్ కట్టర్-5, పవర్ టిల్లర్-3, స్ట్రా బేలర్-1, మొత్తం 373 యూనిట్లు మంజూరయ్యాయి

> **అర్హులకు అందజేస్తాం**
>
> మండలానికి యాంత్రీకరణ పథకం కింద 373 యూనిట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులను గుర్తించి పంపిణీ చేస్తాం. కొన్నేళ్ల నుంచి సబ్సిడీ పరికరాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఆసక్తి ఉన్న వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

భూములు తీసుకుంటే రోడ్డున పడుతాం



హెచ్‌ఎండీఏ కార్యాలయంలో వినతిపత్రం అందిచేందుకు వెళ్తున్న పీరంపల్లి రైతులు

పీరంపల్లి గ్రామస్తులు

అనంతగిరి: ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డు పేర భూములు తీసుకుంటే తామంతా రోడ్డున పడుతామని పీరంపల్లి గ్రామస్తులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో తమ భూములు తీసుకోవద్దని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం ఇచ్చిన సర్వేనంబర్ల ప్రకారం పేద, మధ్య తరగతి రైతుల భూములే ఎక్కువగా పోతున్నాయన్నారు. దీంతో తమ జీవనాధారం కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు మరోసారి ఆలోచించి అలైన్‌మెంట్ మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారంపై హర్షం

– స్పీకర్‌కు ధన్యవాదాలు

అనంతగిరి: నీటి సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఇటీవల మండల పరిధిలోని బురాన్‌పల్లి గ్రామంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పర్యటించారు. దీంతో పలువురు గ్రామస్తులు నీటి సమస్య గురించి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కొత్త బోర్ వేయించి నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం బురాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ద్వారా బోర్ వేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మనోహర్ గౌడ్ స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్పీకర్ గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నా విషయాన్ని గుర్తు చేశారు.



బురాన్‌పల్లి గ్రామంలో బోర్ వేయించిన కాంగ్రెస్ నాయకులు

మెరుగైన విద్యా బోధన చేయాలి

దోమ: ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధన చేయాలని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. శుక్రవారం చెర్లతండా, మెట్టుగడ్డ, పీర్లగుట్ట తండా, బ్రాహ్మణపల్లి, గంజిపల్లి, పాఠశాలలను ఆయన సందర్శించి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవరించకుండా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గంజిపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలలో సురేశ్ అనే వ్యక్తి ఎంఈఓతో కలిసి టై, బెల్టు, టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యా నాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, భీమయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, సుధారాణి, సత్యనారాయణ, నాగరాజు, కన్నయ్య, సీఆర్‌పీ రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



టై, బెల్టు, టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకట్

తండాల అభివృద్ధికి కృషి చేయండి

సీఎంను కోరిన గిరిజన నాయకుడు నరేశ్



సీఎం రేవంత్‌రెడ్డితో గిరిజన నాయకుడు నరేశ్

దుద్యాల్: మండలంలో తండాల అభివృద్ధికి కృషి చేయాలని గిరిజన నాయకుడు నరేశ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుద్యాల్ మండలంలో తండాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారన్నారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు నరేశ్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతి కుమార్



పోలేపల్లిలో పరామర్శిస్తున్న శాంతి కుమార్

దుద్యాల్: కార్యకర్తలకు అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెంది పుర్ర నారాయణ తండ్రి ఇటీవలే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించారు. హకీంపేట్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకోవడంతో ఆయనను కూడా పరామర్శించారు. మధన్, బాబియ్య నాయుడు, బందెప్ప, పాండు, జగదీశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ మైసమ్మతండాలో పోలింగ్ కేంద్రం

తాండూరు రూరల్: మండల పరిధిలోని గుండ్లమడుగు తండా అనుబంధ గ్రామం మైసమ్మ తండాలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీ ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకుల సూచనలమేరకే ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గతంలో మైసమ్మతండా వాసులు నాలుగు కిలోమీటర్లు నడిచి ఓటు వేసేవారని గుర్తు చేశారు. దీంతో వారి సమస్యను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాన్ని మార్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

❖ మాజీ ఎంపీపీకి పరామర్శ

యాలాల: మండల మాజీ ఎంపీపీ తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా కుటుంబాన్ని చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలేశ్వర్‌గుప్తా తల్లి సరోజనమ్మ ద్వాదశ దినకర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీతో పాటు ఆయన సోదరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, రామ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

❖ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

యాలాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి సూచించారు. మండలంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, ఇటువంటి సమయాల్లో వాగులు దాటొద్దని హెచ్చరించారు. చెరువులు, కుంటల్లో చేపల వేటకు వెళ్లొదని సూచించారు. ప్రమాదకర గోడలు, శిథిలావస్థలోని ఇళ్లల్లో నివసించొద్దన్నారు. ఏదైన ఆపద, అత్యవసర పరిస్థితి అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలని పేర్కొన్నారు. కరెంటు స్తంభాలు, ఎర్తింగ్ తీగలకు దూరంగా ఉండాలని, చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాల్లో వెళ్లనీయొద్దన్నారు.

❖ పెండింగ్ బిల్లు మంజూరు చేయండి

బొంరాస్‌పేట: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లు మంజూరు చేయాలని నాగిరెడ్డిపల్లికి చెందిన మేకల అనురాధ అధికారులను కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఇందిరమ్మ పథకంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన ఆమెకు ఏడునెలలుగా బేస్మెంట్ బిల్లు మంజూరు కాలేదు. దీంతో అనురాధ ఈ విషయం గురించి హౌసింగ్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇందిరమ్మ ఇల్లు కొలతల ప్రకారం లేకపోవడం, తిరిగి సరిచేసి ఇల్లు కట్టుకోవడం వల్ల సదరు లబ్ధిదారురాలికి ఆలస్యం అవుతోందని ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్ వివరించారు. సంబంధిత బిల్లు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో ఈ సమస్య వచ్చిందని చెప్పారు. త్వరలో బిల్లు అందేలా కృషి చేస్తామన్నారు.

❖ పాడుబడిన గదిలో పీఏసీఎస్ కార్యాలయం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని మెట్లకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొన్నేళ్లుగా పాడుబడిన గదిలోనే కొనసాగుతోంది. మండలానికి డబుల్‌బీటీ రోడ్లు, అన్నిరకాల భవనాలు మంజూరవుతున్నా తమకు నూతన భవనం మంజూరు చేయడం లేదని సిబ్బంది, సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల కంచె, మురికిగుంతల మధ్య ఈ భవనం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశామని, త్వరలో నిధులు మంజూరు అవుతాయని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ వివరించారు.



పీఏసీఎస్ కార్యాలయం వద్ద మురికి గుంత

క్షేత్ర స్థాయికి వెళ్లి పశువైద్యం

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: మండలంలో మూగజీవాల గోసపై ఈ నెల7న సాక్షిలో ప్రచురించిన ప్రత్యేక కథనానికి మండల పశువైద్యశాఖలో స్పందన లభిస్తోంది. ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని ప్రాథమిక పశుఆరోగ్యకేంద్రంతో పాటు 6 ఉపకేంద్రాలున్నాయి. మండల పశువైద్యాధికారి(వీఓ)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమీల, ఇతర సిబ్బంది విధులపై నిబద్ధత కనబరుస్తున్నారు. సీజనల్‌గా మేకలకు, గొర్రెలకు, గేదెలకు మందులు, వ్యాక్సిన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం పశువులకు మందులు అందుబాటులో ఉన్నాయని అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్‌లో అధిక ధరలకు కొనొద్దని సూచిస్తున్నారు. అత్యవసరపరిస్థితుల్లో గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తున్నామని ప్రమీల చెబుతున్నారు. శుక్రవారం మహంతీపూర్‌లో ఓ రైతు పాడిగేదెకు వైద్యం అందజేశానన్నారు.



గేదెకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి ప్రమీల

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కుల్కచర్ల: అగ్నిప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ ఎస్ఐ సేవ్యానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు మంటలు ఎలా ఆర్పాలని చేసి చూపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ఏదైనా పరిశ్రమలో మంటలు చెలరేగినప్పుడు అప్పటికప్పుడు మంటలను చల్లార్చేందుకు అక్కడ ఉన్న వస్తువుల ద్వారా మంటలను ఆర్పాలని సూచించారు. అగ్నినివారణ వస్తుసామాగ్రి లేని సందర్భంలో దగ్గరలోని నీటివనరులను ఉపయోగించి మంటలను ఆర్పాలన్నారు. ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే 101 లేదా 100నంబర్‌ను డయల్ చేసి సమాచారం అందజేయాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ ఎస్ఐ సేవ్యానాయక్

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న గణిత, సోషల్ ఫోరం సభ్యులు

కొడంగల్ రూరల్: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జిల్లా గణిత, సోషల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో నూతన జీహెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చిన జాక వెంకటేశం, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, సోషల్ విభాగాలకు చెందిన ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్ రెడ్డి, నరహరిరెడ్డి, శ్రీనివాసులు, అబ్దుల్‌హాఖ్, వెంకటేశంలకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, వేణుగోపాల్, మల్లయ్య, అనిల్‌కుమార్, నమ్యానాయక్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ఇంటి పరిసరాలను శుభ్రంచేయిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: తప్పనిసరిగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హకీంపేట్ ఏఎన్ఎం విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆశ కార్యకర్తలో గ్రామంలోని ప్రతి వీధిగుండా తిరుగుతూ వ్యక్తిగత, పరిసరాల ప్రాధాన్యత గురించి వివరించారు. ఇళ్ల ముందు నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇళ్ల ముందు చెత్త నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. దోమల వ్యాప్తితో పలు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని హెచ్చరించారు.



తాండూరు రూరల్: మాట్లాడుతున్న విశ్వప్రసాద్

డ్రై డే నిర్వహించాలి:ఎంపీడీవో

తాండూరు రూరల్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాలు కురుస్తున్న సమయంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు.

'సీతారాం' ఆశయ సాధనకు కృషి



అనంతగిరి: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దుద్యాల్: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



పరిగి: ఏచూరి వర్ధంతిలో సీపీఎం నాయకులు

దివంగత నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయా సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి పార్టీకి, సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో కొనాసాగాలని పలువురు పేర్కొన్నారు.